## క్లుప్తంగా

### వేటపాలెం గ్రంథాలయం పుస్తక భాండాగారం



గాంధీ చేతికర్రను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కరణం, శోభనాద్రీశ్వరరావు

వేటపాలెం: వేటపాలెంలో గల పురాతన సారస్వత నికేతన గ్రంథాలయం పుస్తక భాండాగారమని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పేర్కొన్నారు. స్థానిక సారస్వత నికేతన గ్రంథాలయాన్ని వారు గురువారం సందర్శించారు. గ్రంథాలయంలోని పురాతన పుస్తకాలు, తాళపత్ర గ్రంథాలు, మహాత్మా గాంధీజీ వదిలి వెళ్లిన చేతి కర్రను పరిశీలించారు. గ్రంథాలయ చరిత్రను లైబ్రేరియన్ శ్రీవల్లిని అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయ పాలకవర్గాన్ని అభినందించారు. వీరి వెంట చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, ఎంపీడీవో శర్మ, జిడుగు మస్తాన్, అందే కృష్ణ, ఖాదర్ ఉన్నారు.

### క్వారీల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకోండి

బల్లికురవ: గ్రానైట్ క్వారీ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకుని ఎవరి హద్దులకు వారు లోబడి పనులు చేయించుకోవాలని ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, చిత్తూరు, కడప, జిల్లాల డీడీ ఎంఎస్ అప్పల నాయుడు కోరారు. గురువారం బల్లికురవ మండలంలోని కొణిదెన రెవెన్యూలోని ఈర్లకొండ బీవీయల్ క్వారీని ఆయన తనిఖీ చేశారు. గత నెల 29న శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన లక్ష్మీనారాయణ, మల్లాయపాలెం గ్రామ సమీపంలో చనిపోగా ఆ కేసు సంబంధించి బీవీఎల్ క్వారీలో సీసీ ఫుటేజ్‌ను డీడీఎంఎస్ పరిశీలించారు. మద్యం మత్తుతో వడదెబ్బకు లక్ష్మీనారాయణ రోడ్డుపడి చనిపోయినట్లు డీడీఎంఎస్ నిర్ధారించుకున్నారు. క్వారీకి, లక్ష్మీ నారాయణ మృతికి సంబంధం లేనట్లు తెలిపారు. క్వారీలో పనిచేస్తున్నవారినే అనుమతించుకోవాలని ఇతరులను క్వారీలోకి అనుమతించ వద్దని డీడీఎంఎస్ ఆదేశించారు. వీబీసీ కార్యదర్శి సుభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

### బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

ఇంకొల్లు (చినగంజాం): జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని ఇంకొల్లు సీఐ వీ సూర్యనారాయణ, ఎస్ఐ ఎస్‌కే నాయబ్ రసూల్‌లు హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే 12 మంది వ్యక్తులను గురువారం అదుపులోనికి తీసుకున్నారు.

### యాక్సిడెంట్ చేసిన వ్యక్తి పట్టివేత

పర్చూరు (చినగంజాం): యాక్సిడెంట్ చేసి ఇరువురు యువకులను గాయపరచి.. వెళ్ళిపోయిన వ్యక్తిని పర్చూరు పోలీసులు సాంకేతికత సాయంతో పట్టుకున్నారు. ఈ నెల 17వ తేదీ సాయంత్రం ఇడుపులపాడు గ్రామానికి చెందిన ఇరువురు స్నేహితులు నూతలపాటి విజయ్‌కుమార్, ప్రవీణ్ తమ సొంత పనులు ముగించుకొని తమ ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగి వస్తున్నారు. వారివురు అభయాంజనేయ స్వామి ఆలయం (ఆదిపూడి క్రాస్ రోడ్) వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి నలుపు రంగు బుల్లెట్ నడుపుతున్న వ్యక్తి అతివేగంగా, గుద్ది బండి ఆపకుండా వెళ్ళిపోయాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీసీ కెమెరాల ఆధారంగా తనిఖీ చేసి యాక్సిడెంట్ చేసిన వ్యక్తిని గుర్తించి కేసు నమోదు చేశారు.

### మార్టూరు కిషోర్ కాలనీలో బోరు

మార్టూరు: వేసవి కాలంలో నీటి ఇబ్బందులు తలెత్తకుండా మార్టూరు కిషోర్ కాలనీ వాసుల కోసం గురువారం సాయంత్రం స్థానిక నాయకులు పూజలు నిర్వహించి బోరు తవ్వించారు. ఉప సర్పంచ్ కాకోలు రామారావు, నాయకులు రాజా నాయక్, కాలేషావలి, కాకోలు వెంకటేశ్వర్లు, సులేమాన్, రవిచంద్, గన్నవరం బుడే,సుకుందరావు, తమ్మలూరి సురేష్, ఆవుల శ్రీను, నాగేశ్వరరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### 100 మంది మహిళలకు రంజాన్ తోఫా



తోఫా అందిస్తున్న ఏపీ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

మార్టూరు: రంజాన్ పండగ పురస్కరించుకొని వలపర్ల జామా మసీదు ఆవరణలో గురువారం సాయంత్రం 100 మంది మహిళలకు రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. ఏపీ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బాపట్ల జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి గఢం మస్తాన్‌వలి మహిళలకు రంజాన్ పండుగకు అవసరమైన నిత్యావసర సరుకులును అందజేశారు. షేక్ జాఫర్ అలి, సయ్యద్ కరిముల్లా, షేక్ బీబీ, షేక్ అక్రమ్, ఖాజావలి, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం



కొణిదెన గ్రామంలో పర్యటిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

బల్లికురవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని గ్రామాల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకే గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని కొణిదెన సచివాలయం పరిధిలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలకు సంబంధించిన బుక్ లెట్‌ను అందజేశారు. సచివాలయ వలంటీర్లు వివిధ శాఖల సిబ్బంది పనితీరు తెలుసుకున్నారు. సందర్భంగా చైతన్య మాట్లాడుతూ జగనన్న ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హమీలన్నీ నెరవేర్చి నంబర్ వన్ సీయంగా ప్రపంచ దేశాల్లో గుర్తింపు పొందారని చెప్పారు. నాలుగు సంవత్సరాలుగా అర్హులైన ప్రతిఒక్కరికీ పార్టీలకు అతీతంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. 2024లో జరిగే ఎన్నికల్లో ప్రజాబలంతో మళ్లీ జగనన్నను సీఎంగా చేయాలన్నారు. అంతకు ముందు గ్రామంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద స్వామి ఆలయంలో చైతన్య ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు పాడి పంటతో సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. మండల పార్టీ కన్వీనర్, బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు చింతల పేరయ్య, ఎంపీపీ శ్రీలక్ష్మీ, సర్పంచ్ లేపాక్షి, మాజీ జెడ్పీటీసీ టి. ఏడుకొండలు, కే రాజుపాలెం సొసైటీ అధ్యక్షుడు సుబ్బారావు, మండల ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, అంజనేయులు, చింతల శ్రీనివాసరావు, టి.నరేష్, కేపే ప్రసాదరెడ్డి, మంచాల శ్రీనివాసరెడ్డి, షేక్ శ్రీనువలి, రామాంజనేయులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఈవోఆర్డీ జి. సీతామహాలక్ష్మి పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు హనుమంతరావు, నాయక్, ఏవో ఎస్‌వీపీ కుమారి, ఎంఈవో రాఘవయ్య పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న అర్జీలు పరిష్కరించాలి



కొడవలివారిపాలెంలో మాట్లాడుతున్న తహసీల్దార్

కారంచేడు: గ్రామాల్లోని సచివాలయాలకు వివిధ పనులపై వచ్చే పేద ప్రజల, రైతుల సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలని తహసీల్దారు ఎన్. వెంకటరత్నం అన్నారు. గురువారం మండలంలోని కొడవలివారిపాలెం సచివాలయం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసమే మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థ ప్రారంభించారన్నారు. ఆయన ఆలోచనలకు తగినట్లుగా అంతా కష్టపడి పనిచేద్దామన్నారు. అన్ని రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడంతో పాటు, రైతుల అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాల్సి ఉందన్నారు. ఆర్బీకేల ద్వారా అందించే విత్తనాలు, ఎరువులతో పాటు వివిధ పరికరాలు అందించడం, పంటలను ఇ- క్రాప్ బుకింగ్‌లు చేయించడం, పండిన పంటలకు మంచి గిట్టుబాటు ధరలు వచ్చేలా సిబ్బంది పర్యవేక్షించుకోవాలన్నారు. సర్పంచ్ కొడాలి మోహనకృష్ణ, వీఆర్‌ఓ రాంబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఆమంచి



కలెక్టర్ రంజిత్ బాషాకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఆమంచి

పర్చూరు (చినగంజాం): బాపట్ల జిల్లాకు నూతనంగా నియమితులైన జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషాను గురువారం పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ శాసన సభ్యులు ఆమంచి కృష్ణమోహన్ ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన కలెక్టర్‌తో సమావేశమై పర్చూరు నియోజక వర్గ అభివృద్ధి గురించి చర్చించారు.

## వడదెబ్బ నివారణ హోమియో మందు పంపిణీ

జే.పంగులూరు: ప్రజారోగ్య వేదిక అద్దంకి డివిజన్ ఆధ్వర్యంలో మండలంలోని కశ్యాపురం గ్రామంలో గురువారం వడదెబ్బ నివారణ హోమియో మందును పంపిణీ చేశారు. స్థానిక కోదండ రామస్వామి దేవాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో నేట్రం మోర్–30 హోమియో మందును 400 మందికి పంపిణీ చేశారు. ప్రజా ఆరోగ్య వేదిక జిల్లా అధ్యక్షుడు కె. రఘుచంద్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ఎండలు ఎక్కువగా ఉండటం వలన అనేక మంది వడదెబ్బకు గురవుతున్నారన్నారు. వృద్ధులు, పిల్లలు మరింత జాగ్రత్తగా ఉండాలని కోరారు. వడదెబ్బ నివారణకు హోమియో మందు చక్కగా పనిచేస్తుందన్నారు. అనంతరం నేట్రం మోర్–30 హోమియో మందును పంపిణీ చేశారు. ధూళిపాళ్ల కోటి స్వామి, దూళిపాళ్ల కోటేశ్వరరావు, కూకట్ల రామాంజనేయులు పాల్గొన్నారు.

### వేసవిలో జాగ్రత్త

అద్దంకి: వేసవి కాలం రావడంతో గ్రామాల్లో ప్రజలు రాత్రి సమయాల్లో ఆరు బయట పడుకునే సమయంలో జర జాగ్రత్తగా ఉండాలని సంతమాగులూరు ఎస్సై శివకుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆరుబయట పడుకునే సమయంలో ఇంటికి తాళాలు వేసుకుని పడుకోవాలని చెప్పారు. వేరే గ్రామాలకు, తీర్థయాత్రలు చేయాలనుకుంటే ఇంట్లో విలువైన వస్తువులను భద్రపరుచుకోవాలన్నారు. విలువైన వస్తువులను లాకర్‌లో పెట్టుకుని వెళ్లాలని చెప్పారు. వేసవి సెలవుల దృష్ట్యా ఇంట్లో ఉండే పిల్లలు చెరువుల వద్ద, ఇతకు వెళ్లకుండా జగ్రత్త పడాలని చెప్పారు. హెల్మెట్ లేకుండా వాహనం నడపవద్దన్నారు. లైసెన్స్ లేకుండా, పిల్లలు వాహనం నడపటం నేరమని చెప్పారు. వాహనాల మీద ఉన్న చలనాలు పరిశీలించుకుని వెంటనే చెల్లించాలని చెప్పారు.

## 28న ఎమ్మార్పీఎస్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశం జిల్లా కన్వీనర్

అద్దంకి రూరల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ రాష్ట్ర పర్యటనలో భాగంగా ఈనెల 28న స్థానిక అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించనున్న సమావేశాన్ని విజయవంతం చేయాలని ప్రకాశం జిల్లా కన్వీనర్ రావినూతల కోటి మాదిగ గురువారం కోరారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం 28 సంవత్సరాలుగా సుదీర్ఘ పోరాటాలు నిర్వహించామన్నారు. రాజకీయ పెద్దలను, మేధావులను కలుపుకుని ఒకనూతన ప్రజాస్వామ్య ఉద్యమాన్ని నిర్మించాలని అందుకు మాదిగలంతా కలసి రావాలని కోరారు. సీనియర్ నాయకుడు అలారి చిరంజీవి, తాటిపర్తి రాజు, మాదిగ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర నాయకులు త్రిపుర, కొండ్రు సామేలు, ప్రత్తిపాటి నాగయ్య, జిల్లా సాంవన్, మల్లెల ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

# ఇంటింటికీ సంక్షేమ పాలన



జరుబులవారిపాలెంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న గ్రామ సర్పంచ్



యర్రబాలెంలో పథకాలను వివరిస్తున్న నాయకులు

జరుబులవారిపాలెం (కారంచేడు): రాష్ట్రంలో జగనన్న పాలన ప్రతి ఇంటికీ చేరుతుందని గ్రామ సర్పంచ్ మాదాసు కుమారి అన్నారు. గురువారం మండలంలోని జరుబులవారిపాలెంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి గ్రామస్తులు, మహిళలతో మట్లాడారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా మన ముఖ్యమంత్రి అందిస్తున్న పథకాల ద్వారా ప్రతి ఇంటిలో లబ్ధి చేకూరిందన్నారు. రాబోవు రోజుల్లో మా నమ్మకం నువ్వే జగన్ అంటూ ప్రతి ఒక్కరూ తమ ఓటును వేసి మన నేతను మరలా ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, పాల్గొన్నారు.

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని యర్రబాలెంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలను సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వారు వివరించారు.

## ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

బల్లికురవ: ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా జగనన్న కాలనీలు స్వంత స్థలాలకు మంజూరు చేసిన పక్కా గృహాలను తక్షణమే పూర్తి చేయించాలని తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి, డీఎల్‌పీవో కె. శ్రీనివాసరావు కోరారు. గురువారం బల్లికురవ, కొత్తూరు సచివాలయాలను తహసీల్దార్, డీఎల్‌పీవో తనిఖీ చేశారు. ఆయా సచివాలయాల్లో రికార్డుల తనిఖీ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ఆయా గ్రామాలకు మంజూరైన సచివాలయ, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్ భవనాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం పౌర సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థలో పనిచేస్తున్న వివిధ శాఖ ఉద్యోగులంతా బాధ్యతలు గుర్తెరిగి పని చేయాలని తహసీల్దార్, డీఎల్‌పీవో కోరారు. సెక్రటరీలు పాల్గొన్నారు.

## ప్రసన్నాంజనేయునికి అరటి పండ్ల పూజ



అరటి పండ్ల పూజలో ప్రసన్నాంజ నేయస్వామి

అద్దంకి రూరల్: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి గురువారం అమావాస్య సందర్భంగా పదివేల అరటి పండ్లతో పూజ వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రాతఃకాల సుప్రభాత సేవ, గోపూజ , బిందెతీర్థం, అనంతరం స్వామివారికి అభిషేకం నిర్వహించారు. వేద పండితులు, అర్చకులు, ఉభయదాతలు వేదస్వస్తి మంగళ వాయిద్యాలతో ఆలయ ప్రదక్షిణలు చేశారు. వినాయక స్వామి, సుబ్రమణ్యస్వామి వార్లకు జీవధ్వజ ఉష్ణవాహనానికి నారీకేళి సమర్పించారు. అనంతరం 11 ఆవృత్తాలుగా స్వామివారికి 10 వేల అరటి పండ్లతో పూజ నిర్వహించారు. స్వామివారి మహా నివేదన, పంచహారతుల కార్యక్రమం నిర్వహించారు. ఉభయదాతలుగా సుద్దపల్లి సంజీవరావు, రాజేశ్వరీల కుమారుడు వెంకట తదితరులు సురేంద్ర పాల్గొన్నారు.

### ప్రతిభామూర్తుల కార్యక్రమం రేపు

అద్దంకి: పట్టణంలోని కేర్ అండ్ క్యూర్ హోమియో వైద్యశాలలో శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రతిభా మూర్తులు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జాషువా సాహిత్య వేదిక అధ్యక్షుడు పీసీహెచ్ కోటయ్య గురువారం తెలిపారు. ప్రముఖ రంగస్థల నటుడు బండారు రామారావు గురించి రంగస్థల నటుడు ఆలకుంట శ్రీనివాసరావు ఉపన్యసిస్తారని చెప్పారు. అదే విధంగా రచయిత గోపీచంద్ రచించిన అసమర్థుని జీవన యాత్ర పుస్తకంపై చందలూరి నారాయణరావు సమీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. సహితీవేత్తలు, సాహిత్యాభిమానులు హాజరు కావాలని కోరారు.

### బాకీ విషయంలో గొడవపై కేసు నమోదు

చినగంజాం: బాకీ తీర్చమని అడిగినందుకు వెళ్లి ఇరువురు గొడవపడిన ఘటనలో సంబంధంలేని ముగ్గురు యువకులు గాయాలపాలయ్యారు. ఈ సంఘటన బుధవారం రాత్రి మండంలోని సోపిరాల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై కట్టా అనూక్ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కుంచాల వెంకట శ్రీనివాసరావుకు, అడుసుమల్లి శ్రీనివాసరావు బాకీ ఉన్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి శ్రీనివాసరావును వెంకట శ్రీనివాసరావు నగదు అడిగాడు. మాటామాటా పెరిగి ఇరువురు కుటుంబాల సభ్యులు గొడవపడుతున్నారు. ఆ సమయంలో ఆ రెండు కుటుంబాలతో పాటు వివాదంతో కూడా సంబంధంలేని కూనపురెడ్డి సాయి అనే యువకుడు మధ్యలోకి రావడంతో వెంకట శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు కత్తితో అతనిని, అతని వెంట ఉన్న మరో ఇద్దరిని తీవ్రంగా గాయపరిచారు. గాయాల పాలైన సాయి అతని స్నేహితులు చీరాల వైద్యశాలలో చేరి అక్కడ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం రాత్రి బాగా పొద్దుపోయిన తరువాత కుంచాల వెంకట శ్రీనివాసరావు అతని కుమారులు మహేష్, జగదీష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వీరితో పాటు కొట్లాటలో గాయపరిచారంటూ కుంచాల వెంకట శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అడుమసుమల్లి శ్రీనివాసరావు, అతని కుమారుడు చిరంజీవి, మరో ఇద్దరిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# సంక్షేమంలో సరికొత్త అధ్యాయం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న వెంకటేష్

● నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల: పేద ప్రజల అభ్యున్నతికి వివిధ పథకాలను ప్రవేశపెట్టి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమంలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికారని చీరాల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. గురువారం రాత్రి చీరాల మండలంలోని రామకృష్ణాపురం-2 సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరేలా ఉద్యోగులు, సిబ్బంది పనిచేయాలన్నారు. అనంతరం ప్రతి గడపకు వెళ్లి కుటుంబ సభ్యులను పలకరించి ప్రభుత్వం అన్నీవర్గాల వారికి అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయాని అని అడిగి తెలుసుకున్నారు. వార్డులోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుని తగు పరిష్కారం చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్లు బొనిగల జైసన్‌బాబు, శిఖాకొల్లి రామసుబ్బులు, ఎంపీటీసీ గోలి నాగరాజు, ఏపీఎం సుబ్బారావు, మండా సత్యం, జయరావు, కేబుల్ కృష్ణ, బుజ్జి, చంద్రమోహన్, మున్సిపల్ కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

## చురుకుగా మూడోలైన్ రైల్వేట్రాక్ పనులు

● తాత్కాలికంగా కారంచేడు రైల్వే గేటు మూసివేత



పనుల కోసం మట్టిని తవ్వుతున్న జేసీబీ

చీరాల రూరల్: స్థానిక జాన్‌పేట వద్దగల కారంచేడు రైల్వేగేటు రెండు రోజులు నుంచి తాత్కాలికంగా మూసివేశారు. రైల్వే ట్రాక్ మూడో లైన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అందులో భాగంలో గేటు వద్ద గల సిగ్నల్ పాయింట్ రూమును తొలగించారు. ఆ ప్రాంతంలో ట్రాక్ వేసేందుకు జేసీబీలతో రెండు రోజులుగా రైల్వే అధికారులు రేయింబవళ్లు పనులు చేయిస్తున్నారు. దీంతో రెండు రోజులుగా రైల్వేగేటును తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రజలకు తెలిసే విధంగా లెటర్‌ను గేటు ముందు భాగంలో అతికించారు. మరో రెండు రోజులు పాటు గేటు మూసి ఉంటుందని రైల్వే అధికారులు పేర్కొన్నారు. నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో రైల్వేగేటు మూసివేయడంతో పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు ఐదారు వార్డుల ప్రజలు ఈ గేటు ద్వారానే ప్రతిరోజు రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాక స్కూలు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగాలకు వెళ్లేవారు రైల్వే ఓవర్ బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. దీని వలన పేరాలకు వెళ్లాలంటే ఐదారు కిలో మీటర్లు దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. మూడో లైను ట్రాక్ పనులు త్వరగా పూర్తి చేస్తే ఇబ్బందులు తొలగిపోతాయని ప్రయాణికులు అధికారులను కోరుతున్నారు.

## ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వహించాలి



కలెక్టర్ రంజిత్‌బాషాను కలిసిన సచివాలయాల ఉద్యోగులు

చీరాల టౌన్: ప్రజలకు సత్వరంగా ప్రభుత్వ సేవలను అందించేందుకు ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా సూచించారు. గురువారం నూతనంగా జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రంజిత్ బాషాను గ్రామ, వార్డు సచివాలయాల సంఘం సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈసందర్భంగా సంఘం ప్రతినిధులు పూర్ణ చంద్రరావు, నాగరాజు, విజయ్‌కుమార్, హరికృష్ణ, గౌస్‌బాషా, ఇంతియాజ్, సుబ్బరావు, భార్గవ్‌లు మాట్లాడుతూ సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు యూనిఫారాలు అందించాలని, సచివాలయ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ వర్తింపచేయాలన్నారు. అనంతరం కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ సచివాలయల ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించి ప్రజలకు సేవ చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందజేయాలన్నారు. సచివాలయాల ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ హామీ ఇచ్చారని ఉద్యోగ సంఘం నేతలు తెలిపారు.

### 100 శాతం నిర్మాణాలు పూర్తి కావాలి

జే.పంగులూరు: మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలని జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ, మండల ప్రత్యేక ప్రసాద్ అన్నారు. గురువారం పంగులూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని పీడీ ప్రసాద్ పరిశీలించారు. ఎదుగుదల లేని చిన్నారులను గుర్తించి, పిల్లల వయస్సును బట్టి ఎత్తు, బరువు ఉండాలని వాటిని రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. చిన్న వయస్సులో పిల్లల్లో ఎదుగుదల లోపిస్తే అది భవిష్యత్తులో వారి ఆరోగ్య పై ప్రభావం చూపుతుందని తెలిపారు. చిన్నప్పటి నుంచి విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు జాగ్రత్తలు, వైద్యుల సలహాలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని జగనన్న కాలనీని పరిశీలించి నిర్మాణాలు వేగవంతంగా చేయాలన్నారు. జగనన్న కాలనీలో 100 శాతం నిర్మాణాలు పూర్తికావాలన్నారు. అనంతరం పంగులూరు సచివాలయం-2 ను పరిశీలించారు. రికార్డులు ఎప్పటికప్పుడు పూర్తికావాలని తెలిపారు. కార్యదర్శి సునీత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### దశదిన కర్మకు హాజరైన ప్రముఖులు

కారంచేడు: ఈ నెల 4న కారంచేడులో మృతి చెందిన మూవీ మొఘల్, సినీ నిర్మాత డాక్టర్ దగ్గుబాటి రామానాయుడు తమ్ముడు, సినీ నిర్మాత దగ్గుబాటి రాంమ్మోహన్‌రావు (మోహన్ బాబు) మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. ఆయన దశదిన కర్మను గురువారం కారంచేడులో నిర్వహించారు. చిత్రపటానికి సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్‌బాబు, హీరో దగ్గుబాటి అభిరామ్, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి శోభనాద్రీశ్వరరావు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, చీరాల ఎమ్మెల్యే బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ చీరాల ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్, రామానాయుడు భార్య రాజేశ్వరి, కుమార్తె లక్ష్మి, మోహన్‌బాబు భార్య శారదాదేవి, కుమార్తెలు మాధవి, స్వరూప, సురేష్‌బాబు సతీమణి లక్ష్మి హాజరయ్యారు.



### మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

జే.పంగులూరు: మండల కేంద్రం పంగులూరులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం వెంటనే ఏర్పాటు చేయాలని రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పంగులూరు మండల వ్యవసాయ అధికారి సుబ్బరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తల్లపనేని రామారావు, రాయిణి వినోద్‌బాబు మాట్లాడుతూ మొక్కజొన్న వ్యాపారులు సిండికేట్‌గా మారి.. క్వింటా రూ.2200 ఉన్న మొక్కజొన్నను పదిరోజుల్లో రూ.1750 కి దిగజార్చి రైతుల నోరు కొడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మొక్కజొన్న రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

### విద్యార్థులకు లక్ష్యం తప్పనిసరి

వేటపాలెం: విద్యార్థులు తమ లక్ష్యాన్ని ఎంచుకొని ఉన్నత చదువుల్లో రాణించాలని పాలిటెక్నిక్ డైరెక్టర్ కె విజయభాస్కరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో పాలిటెక్నిక్ ఆఖరి సంవత్సరం విద్యార్థులుకు వీడ్కోలు సభ గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీ నేర్చుకొని ఉన్నత ఉద్యోగాలలో స్థిర పడాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఎం వేణుగోపాలరావు మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న వారిని ఆదర్శంగా తీసుకొని రాణించాలని సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.